


# అలిమేలు

## - పసుపులేటి గీత

(ఆంధ్రజ్యోతి దీపావళి వార్షిక, 1978, 10 నవంబర్)




"**అలిమేలు తన జీవితాన్ని** తన చేతుల్తోనే కూల్చేసుకుందమ్మా. నువ్వు చదువుకున్నదానివి. నీకు తెలుసు, నలభయ్యేళ్ళు కాపురం చేశాక, దాన్నిలా వదులుకోవలసి వస్తుందంటే నా క్షోభ ఎలా వుంటుంది?! ఏం చేస్తాం, దాని ఖర్మ.." ఇక ఆ ఉత్తరం చదవాలనిపించలేదు.

నాన్న నాకు రాసిన చివరి ఉత్తరం అది. ఆయన పోయారన్న వార్త చెవినబడ్డాక ఆ ఉత్తరాన్ని వందన్నొకటోసారి చదివాను. ఎన్నిసార్లు చదివినా ఆ నాలుగు మాటలకు మించి మరో అక్షరమ్ముక్క ముందుకు వెళ్ళలేకపోతున్నాను. అక్కడే ఆగిపోతున్నాను. పోయేవరకు నాన్న అలిమేలు మీద జాలిపడుతూనే వున్నాడు. బాగా జీడిపప్పు పెట్టి పెంచిన నాటు కోడిని జాతర నాటికి కోసి వండుకున్నప్పుడల్లా "ప్చ్... ఈ జాతి కోడి మళ్ళీ దొరకదమ్మా" అంటూ జాలిపడ్డం నాన్న కలవాటు. నాన్న చాలా విషయాలలో ఇలాగే జాలిపడ్డాడు. ఎందుకో హఠాత్తుగా అలిమేలును తలుచుకుంటే నాక్కూడా జాలేస్తుంది. ఒక్కసారి తుళ్ళిపడ్డాను. అలిమేలు మీద జాలా? నాకు సంబంధించినంతవరకు అది మహా పాతకి. దానివల్లే నేను తల్లికి దూరమయ్యాను. నా తల్లిని పొట్టన బెట్టుకున్న వంచకి అలిమేలు. అలిమేలు మా ఇంటి పనిమనిషి. అవును అలా 'పనిమనిషి' అంటూ తక్కువగా, దాని స్థానమేమిటో దానికి తెలియాలంటే దాని బతుకేమిటో దానికి గుర్తుచేయాలంటే,

'పనిమనిషి' అనే అనాలి. మనుషుల్ని కించపరిచేందుకు, వాళ్ళ స్థాయిని దించి చెప్పడానికి మధ్యతరగతి జనం వాడే పదం 'పనిమనిషి', ఆ పదాన్ని వాడాలంటే నాకు పరమ అసహ్యం. అయినా అలిమేలును పనిమనిషి అనే అంటాను.

మా వంశంలో అటేడు తరాల్లోనూ ఇటేడూ తరాల్లోనూ నాన్నే చదువుకున్న వ్యక్తిగా పరిగణింపబడతాడు. హైస్కూలు రోజుల్లోనే నాన్న 'గాంధీజీ' ప్రభావంతో పదో క్లాసుతో చదువు ఆపేసి స్వాతంత్ర్య సమరంలో అడుగుపెట్టాడు. అప్పట్నుంచి ఆయన చాలా చదువుకున్నాడు. జైళ్ళని చదువుకున్నాడు, లాఠీల్ని చదువుకున్నాడు, ఉద్యమాల్ని చదువుకున్నాడు, అటు తరువాత మార్క్సుని చదువుకున్నాడు. లెనిన్‌ని, స్టాలిన్‌ని చదువుకున్నాడు. మానవతావాదాన్ని చదువుకున్నానని నాన్నే అంటూంటారు. అలాంటి నాన్నకు మా అమ్మతో పెళ్ళయింది. అమ్మ తహసీల్దారుగారి అమ్మాయి. పుట్టి పెరిగిన వాతావరణం అమ్మకి నిలబడి పాలు తాగడం నేర్పింది. కానీ పరుగెత్తి నీళ్ళు తాగే నాన్నతో ఆమె ఇమడలేకపోయింది. భర్త నెల జీతం తెచ్చి చేతిలో పోస్తే ఇంటి కోడలిగా సంసారాన్ని నెట్టుకువచ్చే సగటు ఆలోచనల అమ్మకు నాన్నకు అర్థంకాలేదు. వంచిన నడుం ఎత్తకుండా పొలాల్లో, ఫ్యాక్టరీల్లో మగాడితో సమానంగా పనిచేసి, వచ్చిన కూలి డబ్బుల్తో మొగుణ్ణీ, పిల్లల్ని మహరాజుల్లా చూసుకునే ఆడదాని గురించీ, శ్రామిక మహిళ గురించి ఊహించుకునే నాన్నకు అమ్మ అర్థం కాలేదు. అలా అర్థంకాని అమ్మను నాన్న కొట్టేవాడు. వైవాహిక జీవితంలో అసంతృప్తిని చల్లార్చుకునేందుకు నాన్నకు అలిమేలు ఆలంబన అయింది. అలాంటి ఆలంబన గురించి ఆలోచించే నైతిక హక్కు లేని అమ్మ తన సవతితో కలసి ఒకే కప్పు కింద బతకలేకపోయింది. సంవత్సరం నిండని నన్ను ఊయలకి అప్పచెప్పి అమ్మ ఆత్మహత్య చేసుకుంది. నన్ను నాయనమ్మే పెంచింది. అయినా అమ్మలేని లోటు లోటుగానే వుండిపోయింది. దాన్ని తీర్చడానికి అలిమేలు ససేమిరా అన్నది. అమ్మ పోయినప్పట్నుంచి అలిమేలు అనే సున్న పక్కన నాన్న అనే ఒకటి స్థిరపడ్డంతో దాని స్థానం 'పది'లపడ్డది.

అలిమేలుది నిమ్న కులం. మొలకు కాగితం అడ్డుపెట్టుకుని చీర ఉతుక్కుని ఆరేసుకుని, ఆ తరువాత కట్టుకునేది. దాని తల్లీతండ్రీ రోజు కూలీకెళ్ళేవారు. ఆరుగురు సంతానం. అలిమేలు ఐదోది. అక్కచెల్లెళ్ళందరూ పాచిపని చేసుకు బతికేవారు. తండ్రి తాగొచ్చి తన్ని వున్నది కాస్తా లాక్కెళ్ళేవాడు. అలాంటి జీవితం నుంచి విముక్తి కోసం అలిమేలు కలలు కన్నది. మా ఇంట్లో పనిమనిషిగా చేతిన తరువాత అలిమేలు నాన్నకు దగ్గరైంది. అమ్మ పోయిన తరువాత అలిమేలును 'అమ్మా' అని పిలవాలని నాకెవరూ నేర్పలేదు. నాయనమ్మ దాన్ని 'అలిమేలు' అనే పిలవలని చెప్పింది. వయసుతోపాటు అలిమేలు అంటే ఎవరు?' అనే జ్ఞానం కూడా నాకు పెరిగింది. దాంతో దాన్నొక మనిషిగా కూడా తలచుకోవాలంటేనే అసహ్యం వేసేది. ఇంటెడు చాకిరీ అలిమేలు ఒంటిచేత్తో చేసేది. నన్ను మాత్రం నాన్న ఇష్టంగానే చూసుకునేవాడు. నా విషయంలో అలిమేలు భయభక్తులతో ప్రవర్తించేది. ఆ భయభక్తుల వెనుక నాన్నున్నాడు. అప్పట్లో

ఇది నాకు సరైందేననిపించేది. తన పక్కన అలిమేలు స్థానమేమిటన్నది ఆయనెప్పుడూ చెప్పలేదు. తాను ఆయనకు రెండవ భార్యేనని అలిమేలు అనుకునేది. దాని భ్రమలు బద్దలైన సంఘటన ఒకటి జరిగింది.

ఆ మధ్య సెలవులకు ఒకసారి ఇంటికి వెళ్ళాను. ఇంటి పక్కన ఖాళీ స్థలంలో నాన్న మరో డాబా కడుతున్నాడు. నాన్నకు 'వంశనామం' మీద పెద్ద మోజు. తన వంశం తనతో అంతమైపోతుందనీ, తనకు మగ సంతానం ఇవ్వలేని అమ్మ మీద (ఆమె చనిపోయిన తర్వాత కూడా) అస్తమానమూ విరుచుకుపడేవాడు. నాన్నకో తమ్ముడున్నాడు. ఆయనకు ముగ్గురు మగపిల్లలు. తమ తరం తరువాత వంశనామాన్ని ముందుకు తీసుకెళ్ళే వాళ్ళ మీద నాన్నకి చాలా ఇష్టం వుండేది. నాకు పెళ్ళిచేసి పంపేసిన తరువాత వాళ్ళలో ఒకడిని నాన్న దత్తత తీసుకున్నాడు. ఇక అప్పట్నుంచీ ఆ పిల్లవాడి భవిష్యత్తు కోసం ఆస్తులు కూడబెట్టే ప్రయత్నంలో మునిగిపోయాడు. నాన్న మారి పోయాడు. 'స్వంత – ఆస్తి' అనే ఆలోచనే సాంఘిక నేరంగా పరిగణించే ఒక కమ్యూనిస్టు ఆస్తుల సంపాదనలో పడ్డాడు. ఆ సంపాదనలో భాగంగానే కొత్తగా డాబా కట్టడం. ఇంటి వెనుక పచ్చడి బండ వుంది. ఒక రోజు అలిమేలు పచ్చడి నూరుతూ వుంది. నాన్న, ఆయన దత్త కుమారుడు అందరూ పనిమీద బయటికి వెళ్ళిపోయారు. నేను నా కొడుకును ఊయలలో వేసి ఊపుతున్నాను. చక్రాల్లాంటి కళ్ళేసుకుని వాడు నన్ను చూస్తూ, ఊయలలో ఆడుకుంటున్నాడేగాని ఎంతకీ నిద్రపోవడం లేదు. అలిమేలు పచ్చడి బండ చప్పుడు లయబద్ధంగా వినబడుతోంది. దాని గాజుల సవ్వడి కూడా. ఇంతలో గాజులు మౌనం వహించాయి. ఎవరో వచ్చిన అలికిడి.

"అలిమేలూ కాస్త కరివేపాకుంటే నాలుగు రెమ్మలిస్తావా.. హు, ఏవిటీ నూరుతున్నావ్, మసాలానా. అహ అయితే ఈ పూట మీ ఇంట్లో వంటకాలు బలంగా వుంటాయన్నమాట.." సుబ్బాయమ్మ గొంతు వినిపించింది.

"అవునక్కా, ఇయ్యాళ మాంసం తెచ్చినాడు నీ మరిది. మునక్కాయలేసి పులుసు పెడతండ. మద్దాన్నానికి నువు కూడా రా తిందువు" అంటోంది అలిమేలు నవ్వుతూ.

"హు.. ఏవిటోనే అలివేలు! నువ్వీ ఇంటికొచ్చినప్పట్నుంచీ చూస్తూనే వున్నా. ఎలా వొచ్చిందానివి అలాగే వున్నావ్."

"ఏందక్కా, అట్టంటండా, నాకేటి తక్కువైంది.."

"అసలేముందే పిచ్చిదానా, ఎన్నేళ్ళు ఈ ఇంటికి చాకిరి చేసినా నిన్ను లేచొచ్చిన దానివనే అంటారుగానీ, పెళ్ళానివంటారా? నీ మెళ్ళో ఆ ముసల్ది పసుపుతాడు కట్టింది కానీ, దాని కొడుకేవన్నా కట్టాడా?"

"అక్కా, ఆ మాదిరిగా అనబాక.."

"అలా అనడానికి నాకేమన్నా సరదానా. నీ బాగు కోసమే. కాస్త కళ్ళు తెరిచి ఆలోచించు. మీ ఆయన్ని నీ పేరిట ఏమన్నా రాయమను. ఆయన లక్షణంగా వున్నప్పుడే నీ బతుక్కోదారి చూసుకో. ఆయన కూతురేమో ఒక అయ్య యింటికి వెళ్ళిపోయిందాయె. దత్తు తెచ్చుకున్నవాడు రేపు నిన్ను చూస్తాడని గ్యారంటీ ఏంటిట? అందుకే నా మాట

విని, కొత్తగా కడుతున్న ఈ డాబాను నీ పేరిట రాయమను" సుబ్బాయమ్మ గొంతు గుసగుసగా పలుకుతోంది. అలిమేలు గాజుల సవ్వడిలో ఏదో మంద్రత వినిపిస్తోంది. కాసేపటి తరవాత సుబ్బాయమ్మ వెళ్ళిపోయింది. ఈ సంభాషణంతా నా చెవిన బడిన విషయం ఎవరికీ తెలియదు. అలిమేలుకు ఆస్తి హక్కా? పచ్చటి కాపురంలో చిచ్చుపెట్టిన అలిమేలుకు ఇంకా ఏమివ్వాలి? ఎందుకివ్వాలి? మనసు ఆక్రోశిస్తున్నది. అయినా ఏమూలో విచక్షణ నా గొంతుకు అడ్డం పడ్డది. నాకు సంబంధించని గొడవ అనుకుని అంతా మరచిపోయాను. దాని ఫలితం రెండురోజుల తరువాత కనిపించింది. అలిమేలు ఇల్లు విడిచి వెళ్ళిపోయింది. ఆ రోజు నాన్నకు గుండె నొప్పి వచ్చింది. మైల్డ్ హార్ట్ ఎటాక్ అన్నారు. తన అక్క ఇంటికి చేరిన అలిమేలును వెదుక్కుంటూ నాన్న వెళ్ళారు. అలిమేలు నాన్నని పలకరించింది, మాట్లాడింది. కానీ దాన్ని ఇంటికి మాత్రం తీసుకురాలేకపోయాడు నాన్న. ఆయన కుంగిపోయాడు.

"ఇలా చేస్తుందనుకోలేదమ్మా. ఈ వయసులో దానికిదేం పాడుబుద్ధి. ఇలా ఆస్తి కోసం వెంపర్లాడుతుందని అప్పుడే తెలిస్తే దీన్ని ఈ ఛాయల్లో మెదలనిచ్చేవాడినా! అయినా దానికి ఇప్పుడేం తక్కువ చేశానని. చచ్చేదాకా దానికి కావలసింది కాస్తంత కూడూ, గుడ్డా. అవి నా బిడ్డలు దానికి ఇవ్వకుండా పోతారా, అదేమైన బొట్టుగట్టిన పెళ్ళామా? నేనింతకాలం మానవతా దృక్పథంతో దానికి ఇంట్లో స్థానమిచ్చి పెళ్ళాంలా చెలామణి చేశాను. కానీ ఇప్పుడది చట్టప్రకారంగా ఈ వయసులో నేను తనను పెళ్ళి చేసుకోవాలంటున్నది. ఇది జరిగే పనేనా? ఇదేం పెద్ద అందగత్తెనా? డబ్బున్నదా? చదువునందా? దీన్నిపుడు పెళ్ళిచేసుకుంటే, పెళ్ళామై నా సగం ఆస్తిని అప్పణంగా కొట్టేసి దాని అక్క బిడ్డలకి ఇచ్చేస్తుంది. ఎవడో ముక్కూ మొహహం తెలియని వాడికోసమా ఆస్తి కూడబెట్టేది. వీల్లేదు. అది నా పెళ్ళాం కాదు. అది నా 'లంజ' అంతే. అలా అని ఖరాఖండిగా దానితోనే చెప్పేశాను. వస్తేరాని పోతే పోనీ.." అన్నాడు నాన్న నాతో.

"నాన్నా! 'నువ్వు నాకు లంజవి' అనే మాట దాంతోనే చెప్పేశావా?"

"అవును"

ఇక నాకింకేం వినబడలేదు.

నలభయ్యేళ్ళు ఒక మగవాడితో కలిసి వున్న ఆడదాన్ని సజీవంగా దహనం చేయడానికి ఆ ఒక్కమాట చాలనిపించింది.

ఇంటికి వెళ్ళగానే నాన్న పూల మధ్య నిశ్చింతగా నిద్రపోతున్న దృశ్యం కనిపించింది. ఉప్పెనలా దుఃఖం పొంగుకొచ్చింది. ఆయన మీద నన్నిలా వొణికించేంత ప్రేమ అనాలో వున్నదని నేనేనాడూ ఊహించలేదు. అయినా ఏడ్చాను, ఏడ్చాను. అలిమేలు ఒక మూల కూర్చుని వుంది. అది వొచ్చేసింది, కానీ ఆనందించడానికి నాన్న లేరు. అప్పట్నుంచీ అలిమేలు ఇంట్లో ఒక మూల కూర్చునే కాలం గడుపుతోంది. దాని పసుపు కుంకాలు తీయాలని

నాయనమ్మ పట్టుబట్టింది. ఆ రోజు రానే వచ్చింది. ఎంతమంది కలిసినా దాన్ని పట్టుకోలేకపోయారు. అలిమేలు ఎదురు తిరిగింది. "నేనెందుకు పసుపు కుంకాలు తియ్యాల. నేనేవన్నా పెళ్ళాన్నా? లంజను. లంజకి ముండమోపితనం లేదు" ఆడపులిలా అలిమేలు గ్రాండ్రించింది. సూతకం గడిచింది. నేను మా ఊరు బయల్దేరాలి. మరునాడు పొద్దుటే హడావిడిగా అంతా సర్దుకుంటున్నాను. ఇంతలో ఇంటి బయట ఏదో అలజడి. పరుగున వాకిట్లోకి వెళ్ళా. ఇంటికెదురుగా షామియానా. పదిపదిహేను మంది యానాది స్త్రీలు, మగవాళ్ళు. మధ్యలో అలిమేలు కూర్చుని వుంది. షామియానా అంతా ప్లేకార్డులు. "దళిత మహిళకు న్యాయం చెయ్యండి" ఇంట్లోంచి నాన్న తమ్ముడూ, ఆయన కొడుకులూ బయటకు వచ్చారు. కర్రలు గాల్లోకి లేచాయి. నాన్న ఫోటోకు వున్న పూలమాలను నేను 'అలిమేలు' కొప్పులో పెట్టాను.

"అమ్మా, నేనూరు వెళ్తున్నాను" నాకు తెలీకుండానే అప్రయత్నంగా అలిమేలుతో ఆ మాటన్నాను.

COMMENTS